# అత్తగారూ - ఎత్తుక్కేషూ

కొడుక్కి పెళ్ళయీ అవగానే టపీమని అత్తగారై పోవడం, చచ్చీచెడి దుంపల్తంపల్చేసుకుని కూతురికి పెళ్ళిచేసి అత్తగార నిసించుకోవడం ఒకటి కాదుగదా? కాదుకాదు. లెక్చరర్ ముదరగానే హెడ్డాఫ్‌ది డిపార్ట్‌మెంటవుతాడు. అత్తగార్ల లైన్ అఫ్ యాక్టివిటీకూడా అంతే! గుమాస్తా ముదిరి తాసిల్దారయినట్లు, గుమ్మటంలాటికోడలు ముదిరి ముదిరి చూస్తూండగా అత్తగారై పోతుంది. మరి అత్తగారి అత్తగారేమవుతుందవటా అనే డవుటు కలగొచ్చు. అప్పుడా ముసలావిడ రెటైర్డ్‌డెప్టీ కలెక్టరులానో రిటైర్డ్ డీవైయస్పీలానో తయారవుతుంది! రిటైర్డ్ డెప్టీ కలెక్టర్లూ రిటైర్డ్ డీవైయస్పీలూ పళ్ళూడిన బోసిపులుల్లాగానూ కళ్ళు కనబడని ఎరమింగిన ముసలి త్రాచుల్లాగానూ పడకగదుల్లోంచి భోజనాల సావిట్లోకి భోజనాల సావిట్లోంచి వరండాలోకి సణుక్కుంటూ, సీవపందుల్ని సీవ దొరల్ని మెచ్చుకుంటూ, ఇండియాని ఇండియన్ మెంటాలిటీనీ ద్వేషిస్తూ, పేపరు చదివి విసిరి అవతల పారేస్తూ, కుర్రాళ్ళని మందలిస్తూ, మందల్ని కన్నందుకు విచారిస్తూ ఇళ్ళల్లో తిరుగుతూంటారు. పళ్ళూడిన బోసిపులుల్తోనూ కళ్ళు కనపడని ముసలి త్రాచులతోనూ కలిసి జీవించడం ఇంపాసిబులింపాసిబులనుకుంటూంటారు. యంగ్‌మెన్స్ అండ్ యంగ్ లేడీస్!

మా సందు నిండా గెలవేయని అరటి మొక్కల్లాంటి సుశీలలు సీతలు రాధలు బోల్డు మందున్నారు. ఒక్కరికీ కాల్నిలువదు. తోటలో నెమిళ్ళలా గెంతుతూంటారు! రంగులబొంగరాల్లాగ యిక్కడా, అక్కడా ఎక్కడ చూచినా వాళ్ళే! కిలకిలా నవ్వుతూ కొత్త పేకముక్కలాగ

పుట్టుకుంటే జర్రున జారిపోయేట్లుంటారు వాళ్ళ కబుర్ల జలపాతం నయాగరా వాటర్ ఫాల్స్‌ని మించిపోతుంది. బూరెల్లాంటి బుగ్గలూ సోగ కళ్ళూ వయ్యారాల వాల్జడలూ, వాళ్ళనిచూసి కొత్తగా కాపరానికొచ్చిన అమ్మాయిలు వీరితో కలవలేక యింట్లో వుండలేకా టుబీ ఆర్ నాట్ టుబీ అయిపోతుంటారు. పై పేరాలో చెప్పిన ముసలి తాచుల బుస బుసలూ ముసలిపులుల గాండ్రింపులే లేకపోతే, మా వీధిలోని సుశీలలూ సీతలూ రాధలూ ఏ చెట్లక్రిందో ఆడుకొంటూ పాడుకుంటూ, ఏ చెట్లమీదో మేడ మీదో నిలబడి కలలుకంటూ, కబుర్లు చెప్పుకుంటూ, జీవితమంతా గడప గర్లు, వాళ్ళ కంతా చిత్రవే- ఆశ్చర్యవే- ఆనందవే.... కాని మచ్ ఆఫ్‌ది తేడా ది వేవుయ్ లుకెట్ థింగ్స్‌లో వుంటుందంటారు. ముస లాళ్ళు తినవలసినదంతా తినేసి జుర్రవలసినధంతా జుర్రేసి, చేయవల సిన తప్పులన్నీచేసి, "సంసారం సాగరం దుఃఖం" చెడిపోకండర్రా మేం చెప్పేది వినండర్రా అంటారు. మీరు మీ పెద్దాళ్ళు చెప్పేది విన్నారేవిటి, మేం మీరు చెప్పినది వినడానికి అంటారంటారు కుర్రాళ్ళు, కుర్రతనం మళ్ళీ వొస్తుందా? రాదు. పదహారోయేడు మళ్ళీ వస్తుందా- ఏడ్చినా రాదు. హుషార్లుడిగి, సరదాల్చచ్చి, మనసులు మాడి, కోరికలుపుచ్చిపోయి బ్రతుకుల్నీడుచు కొచ్చే ఆర్డినరీస్‌కి, లోకవంతా నిరాశా లోకవంతటా చీకటే కనబడ్డంలో తప్పేంలేదు. కుర్చీలు దిగిన బోసిపులులకీ పడుచు పిల్లల గుండెల రెపరెపలెట్టా అర్థమవుతాయి? మనిషికీ మనిషికీ మధ్య పుప్పయి నలభయ్యేళ్ళ హిస్టరీ జాగ్రఫీ ఆల్జీబ్రా అడ్డోస్తూంటే" మీరు మేం చెప్పినట్లు వినాలి అంటే కుర్రాళ్ళెందుకు వింటారు? వాళ్ళురాకెట్ స్పూత్నిక్ ఏజ్‌లో పెరుగుతున్నారు. మీరేవో బిలాంగ్ టు యె డెడేజ్ మరియు జార్జి స్సిక్తు సార్వభౌముని కాలమువారు. సీవపందుల్ని సీవ దొరల్నీ మెచ్చుకొంటూ బ్రతికేరు. మీరు మీరంతా గుడ్ మార్నింగ్ సార్, హవ్ డు యుడూ గాళ్ళు. ఆఫీసుల్లో లంచాలూ, యిళ్ళ దగ్గర సత్యనారాయణ వ్రతాలూ, నవగ్రహజపాలూ. మీరు ఇంట్లో అర్థడాక్స్

బైట యువర్ మోస్ట్ ఒబిడియంట్ సర్వెంట్లగానూ బ్రతికారు. మాకు బ్లూమింగ్‌గా కనిపించేవి మీకు చాలా గ్లూమీగా కనిపిస్తాయి. భవిష్యతంటే చిరాకూ వర్తమానవంటే అసహ్యం మీకు, మాకు ప్రెజెంటే ప్లెజంట్- భవిష్యత్తంతా ఒక రంగుల డేరా....

బైదిబై కమింగ్ టుది సబ్జట్-

కొడుక్కి పెళ్ళిచేసి అత్తగారయిన ఆడది తర్చూ భూకంపాల్ని పుట్టిస్తో వుంటుంది. కూతురికి పెళ్ళిచేసిన ఆవిడ ఆ భూకంపాలన్నీ భరిస్తో వుంటుంది. అసలు ఆడవాళ్ళవల్లనే కుటుంబాల్లో తర్చూ భూకంపాలొస్తూంటాయని వినికిడి. భూమి- అట్టడుగున కొన్నివేల కిలో మీటర్ల క్రింద, లావా మీద నారింజ పండులా తేల్తో వుంటుందట. మనుష్యులలో అట్టడుగునకూడా లావాలాటి సంగతులు పేరుకుని కుతకుతా వుడుకుతూవుంటాయి. లావా గడ్డకట్టినపుడు తరంగాలు తరంగాలుగా (తరంగాలూ అష్టపదులూ పాడుకుంటూనే) ఇళ్ళల్లో భూకంపాల్ని పుట్టిస్తూంటారు. అన్ని కుటుంబాలూ చాలామట్టుకు లావా మీద తేల్తున్న భూమిలా వుంటూ, అప్పుడపుడు భూకంపాలు వస్తే ఆ షాక్‌కి కొందరి సంసారాలు కూలిపోవడం, కొందరివి బీట లిచ్చేయడం జరుగుతూ వుంటుంది. కుర్రాళ్ళు చట్టాపట్టాలేసుకుని సేఫ్‌సేఫర్ సేఫెస్టు అని పరుగుచ్చుకుంటారు. అప్పుడు తాతగారి మీసాల ఫొటోల్ని చూపించినా బీరువాలూ భోషాణాలు అడ్డంగాపెట్టినా ఆగరు. పరుగో పరుగు—

డబ్బుకూడా లావాలాటి ఉపద్రవమే! అది గడ్డగట్టుకుపోతే సమాజంలోకూడా చిన్న కుదుపు లాటిది బయల్దేరి అగ్ని పర్వతం బ్రద్దలయినట్లు, ఎప్పుడో ఒహప్పుడు భూమి బ్రద్దలయి సముద్రాల్ని ఎడారులుగానూ, ఎడారుల్ని సముద్రాలుగానూ కొండల్ని పీఠభూములుగానూ, పీఠభూముల్ని లోయలుగానూ మార్చిపారేస్తూంటుంది. మన పంచవర్ష ప్రణాళికల అట్టడుగున గుత్తాధిపత్యం లావా గడ్డగట్టినట్లు గడ్డ కడుతోందని వీకే ఆర్వీరావుగారన్నార్ట.

ప్రభుత్వం మనకి అత్తగార్లాటిదేకదా ! అందుకే "అత్తగారూ—ఎర్త్క్వేకు" వస్తుంది జాగ్రత్త అని జాగ్రత్తపడ మంటున్నాను. అంతే గాని భానుమతి అత్తగారిని ఎర్త్క్వేకు పేర్చెప్పి హడలకొట్టేద్దావని నా ఉద్దేశం కాదెంతమాత్రం కాదు. భానుమతి అత్తగారికి ఎర్త్క్వేకు కేకు లాటిది. ఆవిడ అదిశేషుడు భూభారం మోయలేక బుజం మార్చు కొంటున్నాడని సరిపెట్టుకోగలదు. షియీజ్ ఎడామ్ కేర్ మాస్టర్ మరియు కడు ఇన్నోసెంట్ రిచ్ విడో (మన ప్రభుత్వాల్లాగ). అందుకే "అత్తగారూ—ఎర్త్క్వేక్క—"ని మరోమాటు వార్నింగిస్తున్నా, ఎందుకంటే చెప్పలేదంటనకపొయ్యేరూ, జనులారా గురునీ, చేరి కొలిచిన ముక్తినం దేరూ.... లేకపోతే మనపని—శివగోవింద, గోవింద—హరి భజ గోవింద గోవిందా అయిపోతుంది.